క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం


తానేటి వనిత, మాజీ హోం మంత్రి

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శనివారం మధ్యాహ్నం 3గంటలకు దేవరపల్లి మండలం యర్నగూడెంలోని హైవే వద్ద గల ఆర్ కన్వెన్షన్ హాల్లో జరుగుతుందని మాజీ హోం మంత్రి, పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత శుక్రవారం తెలిపారు. పార్టీ అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ పేరుతో కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించేందుకు చేపట్టవలసిన కార్యాచరణపై ఈ సమావేశంలో ప్రధాన అంశంగా చర్చించనున్నట్టు ఆమె తెలిపారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్టు చెప్పారు. కావున నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

వేళ్లచింతలగూడెంలో ఉద్రిక్తత


వేళ్లచింతలగూడెంలో ఇరువర్గాల నాయకులతో చర్చలు జరుపుతున్న ఎస్సై మనోహర్

గోపాలపురం: మండలంలోని వేళ్లచింతలగూడెంలో శుక్రవారం రాత్రి బాబూ జగ్జీవన్‌రామ్ జెండా, విగ్రహానికి దిమ్మ కడుతున్న సమయంలో సమీప గ్రామస్తులు నిలుపుదల చేసి పోలీసులకు సమాచారం అందించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ప్రక్కన ఉన్న ఖాళీ స్థలంలో జగ్జీవన్‌రామ్ జెండా స్థూపం, విగ్రహానికి సన్నాహాలు చేయడం సబబుకాదని ఇరువర్గాల మధ్య వైషమ్యాలు ఏర్పడతాయని గ్రామస్తులు ఎస్సై మనోహర్‌కు వివరించారు. గతంలో బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు సమయంలో ఎటువంటి విగ్రహాలు ఏర్పాటు చేయమని గ్రామానికి చెందిన ఇరువర్గాలు స్థలం యజమానికి అప్పట్లో లిఖిత పూర్వకంగా పోలీసులకు వివరించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనకుండా ఎస్సై పి.మనోహర్ పోలీసు గస్తీ ఏర్పాటు చేశారు.

మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా అసిస్టెంట్ ఇంజినీర్ ఎ.సందీప్ శుక్రవారం నుంచి పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) స్వీకరించారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. పట్టణ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పునర్నియామకాలు కోసం ఎదురుచూపు

దేవరపల్లి: ఉద్యోగ పునర్నియామకం కోసం ఆరోగ్య సహాయకులు ఎదురు చూపులు చూస్తున్నారని ఆంధ్రప్రదేశ్ పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం కన్వీనర్ జీవీవీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన నల్లజర్లలో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 920 మంది, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 150 మంది ఆరోగ్య సహాయకులను కోర్టు ఉత్తర్వుల పేరుతో ప్రభుత్వం ఉద్యోగాల నుంచి తొలగించినట్టు ఆయన తెలిపారు. ఉద్యోగాలు కోల్పోవడంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులు భారంగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారిని తిరిగి విధుల్లో చేర్చుకుని ఆదుకోవాలని ఆయన కోరారు.

300 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం

పెరవలి: ఖరీఫ్ వరిసాగులో నాట్లు వేయని రైతులు డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేసుకుంటే సకాలంలో పంట చేతికందుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఎగ్జక్యూటివ్ రామకృష్ణ తెలిపారు. పెరవలి మండలం ముక్కామల గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో 50 మంది రైతులు సాగు చేయటానికి ముందుకు రావటంతో శుక్రవారం డ్రమ్ సీడర్‌తో విత్తనాలు నాటారు. వరిసాగులో ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించాలంటే డ్రమ్‌సీడర్‌తో విత్తనాలు నాటుకోవాలని తెలిపారు. ఆకుమడి ఖర్చులతో పాటు వరినాట్లు వేసే పరిస్థితి ఉండదని దీనివలన ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. ఎకరానికి కేవలం 8 కిలోల విత్తనాలు మాత్రమే అవసరమవుతాయని చెప్పారు. 300 ఎకరాల్లో సాగు చేయటానికి రైతులు ముందుకు వచ్చారని ప్రభుత్వం 50శాతం సబ్సీడీపై సరఫరా చేస్తుందని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉమా మహేశ్వరరావు, సూర్యనారాయణ, ముత్యాలు,ప్రశాంతి, వెంకటరమణ, జ్యోతి, భవానీ, రైతులు పాల్గొన్నారు.

అడుగుకో గొయ్యి.. గజానికో నుయ్యి


కాకరపర్రులో గోతుల మయంగా ఉన్న రహదారి


కొత్తపల్లి అగ్రహారంలో...


పెరవలిలో గోతులుపడిన రోడ్డు

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- 40 ప్రమాదాల్లో ఐదుగురు మృతి
- 45 మంది క్షతగాత్రులు
- పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం

పెరవలి: గ్రామీణ ప్రాంతాల రోడ్లు నానాటికి గుంత ఎక్కుడుందో దారి ఎక్కడుందో కనుక్కోవాల్సిన పరిస్థితి అన్న చందంగా తయారవుతున్నాయి. చినుకు పడి ఛిద్రమైన రోడ్లను చూసి వాహనచోదకులు, ప్రయాణీకులు హడలిపోతున్నారు. అడుగుకో గొయ్యి గజానికో నుయ్యి అనే విధంగా మండలంలోని కానూరు–నడుపల్లి రోడ్డు, కానూరు–అగ్రహారం వెళ్లే రోడ్డు, నిడదవోలు–నరసాపురం రోడ్డు, కొత్తపల్లి - అగ్రహారం, కాకరపర్రు- అజ్జరం రోడ్డు, పెరవలి- పిట్టల వేమవరం రోడ్డు, పేకేరు–పిట్టల వేమవరం రోడ్లు పాడైపోవడంతో వాహనదారులు నానా అగచాట్లు పడుతున్నారు. ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తున్నదని ప్రయాణీకులు వాపోతున్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ గోతులు మరింత పెద్దవై మడుగుల్లా తయారయ్యాయి. అసలే అంతంతమాత్రం రోడ్లతో అవస్థలు పడుతున్న ప్రజలకు ఉచిత ఇసుక పుణ్యమా అంటూ అధిక లోడుతో ఇసుక, గ్రావెల్, మెటల్ వాహనాల రాకపోకలతో ఉన్నరోడ్డు కాస్తా దిగబడి రాళ్లు లేచి గోతులు పడుతున్నాయి.

ఎన్ని కిలోమీటర్లంటే..

గ్రామీణ ప్రాంతాల్లో ఆర్అండ్‌బీ, జాతీయ రహదారిని ఆనుకున్న గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని చెప్పవచ్చు. ఈ రహదారులు సుమారు 45 కిలోమీటర్లు ఉంటే అందులో 30 కిలోమీటర్ల రోడ్లు పాడైపోయాయి. కనుచూపు మేర కంకరతేలిన దారి దుమ్ము, ధూళితో కనిపించని రోడ్లు ఇదీ మండలంలోని రహదారుల దుస్థితి. అధ్వానంగా మారిన రోడ్లపై ఒక్క కిలోమీటర్ దూరం ప్రయాణిస్తే చాలు ఒళ్లు హూనమవ్వడం ఖాయం. అంతేనా, వర్షాకాలం వచ్చిందంటే చెరువులను తలపించే రోడ్లతో పేరుకుపోయిన బురదతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి కావాల్సిందే.

అధిక లోడుతో ధ్వంసం..

మండలంలో అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు కాస్తా పాడైపోయి ఉండగా బాగున్న రోడ్లు కూడ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో ఉన్న రోడ్డు పాడైపోతున్నవి. వడలి ముక్కామల ఆర్అండ్‌బీ రహదారి 18 నెలల క్రితం రూ.24 కోట్లతో నిర్మిస్తే దానిపై మురుగునీరు వదలి వేయటంతో ప్రయాణీకులు పడరాని పాట్లు పడుతున్నారు. దీనిపై ఎన్ని సార్లు పిర్యాధులు చేసినా పట్టించుకున్న పాపాన్న పోలేదు. నిడదవోలు–నరసాపురం ఆర్అండ్‌బీ రోడ్డులో కానూరు వద్ద కల్వర్ట్ నిర్మాణంతో వాహనాలను కానూరు–నడుపల్లి మీదుగా మల్లించటంతో రోడ్డు మొత్తం శిథలమైపోయింది. దీనితో ప్రయాణీకులు ఉండ్రాజవరం మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. దీనికి తోటు అధిక లోడు వాహనాలు రాకపోకలు వలన ఉన్న రహదారి కాస్తా గోతులు పడి అధ్వానంగా తయారయ్యింది.

ప్రమాదాల రోడ్లు

నిడదవోలు–నరసాపురం, కానూరు–నడుపల్లి రోడ్డు, వడలిముక్కామల ఆర్అండ్‌బీ రహదారులు ప్రమాదకరంగా మారాయి. ఈ రహదారుల్లో నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుతుండటంతో ప్రయాణీకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించవలసి ఉంది. గోతుల కారణంగా వాహనాలు దెబ్బతినడంతో నానాపాట్లు పడుతున్నారు. ఇప్పటి వరకు ఈ రహదారుల్లో ఈ ఏడాది 40 ప్రమాదాలు జరగ్గా అందులో 5 గురు మృత్యువాత పడగా 45 మంది క్షతగాత్రులుగా మిగిలారు.

పట్టించుకోరు



వడలి- ముక్కామల రోడ్డులో గ్రామాల వద్ద మురుగునీరు రోడ్డుపై వదలివేయటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై పలు మార్లు పిర్యాధులు చేసినా పంచాయతీ అధికారులు పట్టించుకోవటం లేదు.

దిద్ద సంపతిరావు, ప్రయాణీకుడు ఖండవల్లి

గోతులైనా పూడ్చండి



గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్నాయి, ఏ గ్రామానికి వెళ్లినా ముందుగా దర్శనం ఇచ్చేవి గోతులు పడిన రహదారులు, రోడ్డ నిర్మించకపోయినా పర్వాలేదు, కనీసం గోతులైనా పూడ్చండి.

పిల్లా శ్రీనివాస్, కొత్తపల్లి గ్రామస్తుడు

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

నిడదవోలు: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకాన్ని పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం విడుదల చేసింది. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. నిడదవోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా కటారు సిద్దార్థవర్మ, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలుగా నిడదవోలు ఎంపీపీ తిరుమల భాగ్యలక్ష్మి ఎంపికయ్యారు. నియోజవర్గ రైతు విభాగం అధ్యక్షుడిగా కంటిపూడి వెంకటరమణ, బీసీ సెల్ అధ్యక్షుడిగా వెలగన పోలయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పొట్టి రాంబాబు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా కొత్తాడ సురేష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ ఖాన్‌బాషా, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా పెట్టా స్టీఫెన్, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా రొట్టి నవీన్ కుమార్, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడిగా కొండపల్లి శ్రీనివాసరావు, మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా ఆకుల ముకుందరావు, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడిగా బందేల శ్యామ్, వాలంటీర్ విభాగం అధ్యక్షుడిగా నైదాని సాయిరాం, గ్రీవెన్స్ సెల్ విభాగం అధ్యక్షుడిగా ముళ్లపూడి శ్రీనివాస్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా మడిపల్లి భాస్కరం, వీవర్స్ విభాగం అధ్యక్షుడిగా కరెళ్ల శ్రీనివాస్, వైఎస్సార్ టీయూసీ విభాగం అధ్యక్షుడిగా నిమ్మల వెంకట శ్రీనివాస్, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షుడిగా ఊబా జాన్సీ, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా వేదుల వెంకటేష్, కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా చర్ల శ్రీరామ్ చంద్రమూర్తి, పార్టీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా దాలి కనకేశ్‌రెడ్డి, ఐటీ విభాగం అధ్యక్షుడిగా ఎండి అబ్దుల్ రెహమాన్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా విల్లూరి ప్రసాద్, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడిగా అదార్థి వెంకట కృష్ణారావు, పబ్లిక్ విభాగం అధ్యక్షుడిగా ఆలమూరు రాజా, ఇంటెలిక్చువల్స్ ఫారం విభాగం అధ్యక్షుడిగా అంకంపాలెం శ్రీనివాస్, ఉద్యోగ, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా గోనబోయిన పాండురంగారావు, వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడిగా రామడుగుల సూర్యనారాయణలు ఎంపికయ్యారు. నూతన కమిటీలో నాయకులు ఆయా విభాగల్లో పార్టీని బలంగా ప్రజల్లోకి తీసు కెళ్లేందుకు కృషి చేయాలని అదిష్టానం సూచించింది.

ఏడాదికే విసుగెత్తిన ప్రజలు


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

చాగల్లు: ఏడాది కూటమి ప్రభుత్వ పాలనకే ప్రజలు విసుగెత్తిపోయారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. చాగల్లులోని ఓ కల్యాణ మండపంలో 'బాబూ ష్యూరిటీ..మోసం గ్యారంటీ' కార్యక్రమంపై మండల స్థాయి పార్టీ శ్రేణుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏడాది పాలనలో యువతకు రూ.38,400 కోట్లు, అన్నదాత సుఖీభవ కార్యక్రమం ద్వారా 85,382 మంది రైతులకు రూ.10,717 కోట్లు, నిరుద్యోగ భృతి కింద రూ.781 కోట్లు, తల్లికి వందనం పథకానికి రూ.13,111 కోట్లు, దీపం పథకం కింద రూ.4,900 కోట్లు రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం బాకీ పడిందని తలారి మండిపడ్డారు. బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రభుత్వం తొలి అడుగు పేరుతో ఇంటింటికీ వచ్చే ఎమ్మెల్యేలు, కూటమి నాయకులను ఎన్నికల ముందు ఇచ్చిన హామీల బాండ్లను చూపి నిలదీయాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు జి.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమని రమేష్, ఎంపీపీ మట్టా వీరాస్వామి, మాజీ సర్పంచ్ గంద్రోతు సురేంద్రకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా ఏడుకొండలు,పార్టీ మండల అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, ఆర్టీఏ జిల్లా విభాగం అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, సర్పంచులు ముప్పిడి మహాలక్ష్మడు, మద్దిపాటి శ్రీరామమూర్తి, కుడప రాంబాబు, నాయకులు ఉండవల్లి శ్రీనివాస్, బొర్రా రజనీప్రసాద్, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, ఎస్‌కే యూషఫ్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి


గోపాలపురం ఎస్సై మనోహర్‌కు చంద్రబాబుపై ఫిర్యాదు చేస్తున్న జిల్లా అధ్యక్షుడు సాలి వేణు

గోపాలపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాలి వేణు డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు శుక్రవారం గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పి.మనోహర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం సాలి వేణు మాట్లాడుతూ గుంటూరు జిల్లా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చీలి సింగయ్య ఎస్సీ మాదిగ కులవ్యక్తిని కించపరిచే విధంగా అసభ్యకరంగా వ్యాఖ్యానించినందుకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ నిబంధనల ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు తన ప్రసంగంలో మృతుని గురించి మాట్లాడుతూ కుక్కమాదిరిగా తీసి పక్కన పడేసి వెళ్లిపోయారు అనే పదాలు వాడారు. ఈ వ్యాఖ్యలు అమానుషం, అవమానకరమైనవి ఎస్సీ మాదిగ వ్యక్తి గౌరవాన్ని మాత్రమే కాదు మొత్తం సామాజిక వర్గాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని అన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబుపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి న్యాయపరమైన చర్యలు తీసుకొని ఎస్సీ వర్గాల గౌరవాన్ని పరిరక్షించాలని ఫిర్యాదులో కోరారు.

బ్రిటిషర్లను వణికించిన అల్లూరి


వెలగదుర్రులో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న క్షత్రియ సేవా సంఘం సభ్యులు


సమిశ్రగూడెంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


పట్టణంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామాల్లో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. వెలగదుర్రు, సత్యవాడ, వడ్లూరు గ్రామాల్లో అల్లూరి విగ్రహాలకు పూలమాలలు వేసి శుక్రవారం నివాళులర్పించారు. వెలగదుర్రులో క్షత్రియ సేవాసంఘం, సత్యవాడలో క్షత్రియ యూత్ సభ్యులు, వడ్లూరులో అల్లూరి సీతారామరాజు సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్రిటిషర్ల గుండెల్లో వణుకుపుట్టించిన వీరుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముదునూరి నారాయరాజు, ముదునూరి రవీంద్రరాజు, ఇందుకూరి కేశవ రాజు, ఇందుకూరి రామకృష్ణంరాజు, శ్రీనివాసరాజు, ధనిశెట్టి ఉమామహేశ్వరరావు, వేదుల శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత అల్లూరి సీతారామరాజు

నిడదవోలు రూరల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అందరికీ స్ఫూర్తి ప్రదాతని క్షత్రియ సేవా సమితి పెండ్యాల గ్రామ అధ్యక్షుడు కంతేటి సీతారామరాజు అన్నారు. నిడదవోలు మండలం సింగవరం, పెండ్యాల, సమిశ్రగూడెం గ్రామాల్లో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అల్లూరి విగ్రహానికి స్థానిక ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఉప్పులూరి రామ్మోహన్‌రావు, ఎండీ అక్రం తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి ఆశయ సాధనకు కృషిచేయాలి

నిడదవోలు: స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్‌వారికి ముచ్చెమటలు పట్టించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సీఐటీయూ నాయకులు జువ్వల రాంబాబు అన్నారు. అల్లూరి 128 జయంతి సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో గాంధీనగర్‌లో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

ఎంతో ధైర్య సాహసాలతో బ్రిటీష్‌వారిని ఎదురించి తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన అల్లూరి జీవితాన్ని యువతీ యువకులు ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు రంగా వెంకటేశ్వరావు అన్నారు. పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం అల్లూరి 128 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్‌లో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డెంగీ నిర్మూలనకు సహకరించాలి


దేవరపల్లి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నల్లజర్ల మండలం పోతవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సిరాజ్ తెలిపారు.ఈ నెల 31 వరకు డేంగీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.వ్యాధి నిర్మూలనకు సహకరించాలని ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉండాలని, నీటి నిల్వలు ఉండరాదని, పాత టైర్లు, తాగిన కొబ్బరి బొండాలు ఇంటి పరిసరాల్లో ఉంచరాదని ఆయన సూచించారు. దోమతెరలు వాడాలన్నారు.


పచ్చని చెట్లను నరికేశారు



నరకంతో మోడువారిన వృక్షం

నిడదవోలు: ఇటీవల రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణలు ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటాలని పర్యావరణాన్ని రక్షించాలంటూ ఊకదంపుడు ఉపన్యాసం ఇచ్చారు. దీనికి విరుద్ధంగా కొందరు పట్టణ నడిబొడ్డున 15వార్డు రాయిపేటలో పచ్చని చెట్లను అక్రమార్కులు తమ స్వార్థం కోసం నరికి విక్రయించుకుని సొమ్ము చేసుకుంటున్నారు. గత రెండు రోజులుగా రాయిపేట, ఇందిరానగర్, గాంధీనగర్ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి దశాబ్దాలుగా చల్లని నీడనిచ్చె పెద్ద చెట్లను కొందరు అక్రమార్కులు ఎటువంటి అనుమతులు లేకుండా నరికి వేయడంతో సర్వత్ర విమర్శలు వస్తున్నాయి. ఎందుకు నరికివేస్తున్నారో స్థానికులకు అర్థంకాక ఇదేమి చొద్యం అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. స్థానికుల ఫిర్యాదుతో మున్సిపల్ ఏఈ హేమంత్‌కుమార్ అక్కడకు వెళ్లి తూతూమంత్రంగా విచారణ చేసి చేతులు దులుపుకున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణ నడి బొడ్డున మున్సిపాలిటికి చెందిన ఆస్తులను కొల్లగొడుతుంటే వారికి పట్టదా అంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

వంగవీటి సేవలు చిరస్మరణీయం


మోహనరంగాకు నివాళులర్పిస్తున్న, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, నాయకులు


చాగల్లులో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న తలారి వెంకట్రావు


దేవరపల్లిలో రంగా విగ్రహం వద్ద కేక్ కట్‌చేస్తున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు, కాపు సంఘం నాయకులు

నిడదవోలు రూరల్: బడుగు, బలహీన వర్గాలకు వంగవీటి మోహనరంగా చేసిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపాలెం విజ్జేశ్వరం, డి.ముప్పవరం, తాడిమళ్ల, సమిశ్రగూడెం, అట్లపాడు గ్రామాల్లో కాపు ఉద్యమ నేత వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తిమ్మరాజుపాలెంలో జరిగిన కార్యక్రమంలో రంగా విగ్రహానికి పల్లారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రంగా స్ఫూర్తితో సేవలు

చాగల్లు: మాజీ ఎమ్మెల్యే, కాపు నేత వంగవీటి మోహన రంగా స్ఫూర్తితో పేదలకు సేవలు చేయాలని, అదే ఆయనకు మనమిచ్చే ఘన నివాళని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. చాగల్లులో శుక్రవారం జరిగిన రంగా జయంతి వేడుకల్లో పాల్గొని రంగా చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంద్రోతు సురేంద్రకుమార్, జుట్టా ఏడుకొండలు, ఇంటి వీర్రాజు, పిండి మంగరాజు, ఆదేష్, జి.వాసు, కంఠమని రమేష్, మట్టా వెంకట్రావు, బొర్రా కృష్ణ, జాలెం వెంకట్రావు, చీలి ప్రసాద్, గెడ్డం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన కాపు నాయకులు

తాళ్లపూడి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వంగవీటి మోహన్ రంగా 78వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దేవంలోని పంచాయతీ వద్ద ఉన్న రంగా విగ్రహంకు కాపు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించించారు. రాష్ట్ర కాపు జేఏసీ మెంబర్ తోట రామకృష్ణ, గెడ్డం గాంధీ, నరాలశెట్టి వీర వెంకటరావు,మైలవరపు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే రంగా ఆశయం

ఉండ్రాజవరం: దివంగత వంగవీటి మోహన్ రంగా జయంతి వేడుకలను శుక్రవారం కె.సావారం, తాడిపర్రు, తదితర గ్రామాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రంగా విగ్రహాలకు కాపుయువత ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల అభ్యున్నతే రంగా జీవిత ఆశయంగా సాగారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నార్ని రామకృష్ణ, పాలిశెట్టి బాలాజీ, కాపు యువత పాల్గొన్నారు.

దేవరపల్లి: దివంగత వంగవీటి మోహనరంగా జయంతితిని వైఎస్సార్ సీపీ, జనసేన, కాపు సంఘం, యువజన సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఘనంగా నిర్వహించారు. స్థానిక మూడు బొమ్మల కూడలిలోని రంగా విగ్రహానికి ఎంపీపీ కేవీకే దుర్గారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కడిమి రాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డి. సువర్ణరాజు, కాపు సంఘం నాయకులు కవల శ్రీనివాస్, మాధవరపు వెంకటేశ్వరరావు నివాళులు అర్పించారు. ఎంపీపీ దుర్గారావు కేక్‌కట్ చేశారు. యర్నగూడెంలో రంగా ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. రంగా విగ్రహానికి ప్రముఖ పారిశ్రామిక వేత్త కొమ్మన మణిబాబు, పుట్టా జగన్మోహనరావు నివాళులు అర్పించారు.

దేవరపల్లి: మాజీ ఎమ్మెల్యే, కాపు సంఘం నేత దివంగత వంగవీటి మోహనరంగా 78వ జయంతి వేడుకలను శుక్రవారం దేవరపల్లిలో వైఎస్సార్ సీపీ, జనసేన, కాపు సంఘం, యువజన సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఘనంగా నిర్వహించారు. స్థానిక మూడు బొమ్మల కూడలి ప్రాంతంలోని వంగవీటి మోహనరంగా విగ్రహానికి ఎంపీపీ కేవీకే దుర్గారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కడిమి రాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డి. సువర్ణరాజు, కాపు సంఘం నాయకులు కవల శ్రీనివాస్, మాధవరపు వెంకటేశ్వరరావు, పచ్చా రాంగోపాల్, దుగ్గిన గంగాధర్, కామిశెట్టి దుర్గారావు, పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ దుర్గారావు కేక్‌కట్ చేశారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు, కాపుల సంక్షేమానికి వంగవీటి మోహనరంగా చేసిన కృషిని ఈ సందర్భంగా దుర్గారావు వివరించారు. యర్నగూడెంలో రంగా ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలను నిర్వహించారు. రంగా విగ్రహానికి ప్రముఖ పారిశ్రామిక వేత్త కొమ్మన మణిబాబు, పుట్టా జగన్మోహనరావు, తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. రంగా ఆశయాలకు అనుగుణంగా నేటి యువత నడుచుకోవాలన్నారు. అనంతరం ఆయన చేసిన సేవలను రాజకీయ ప్రస్థనాన్ని కొనియాడారు. కొన్ని రాజకీయ శక్తులు కుట్ర పన్ని హత్య చేశారన్నారు. వివిధ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు, రంగా అభిమానులు పాల్గొన్నారు.